**కథ**

# ఖాకీ యూనిఫాం

**దానం శివప్రసాదరావు**

**రాత్రి తొమ్మిది గంటలు కావొస్తోంది. గతుకుల తారురోడ్డు మీద ఎర్రబస్సు ఆగింది. యువకుడైన కానిస్టేబుల్ గంగాధరం ఒక్కడే బస్ దిగాడు. అప్పుడే వాన కురిసి వెలిసిందల్లె ఉంది. చిత్తడి చిత్తడిగా ఉంది. గుంతల్లో నీళ్లు నిలబడి ఉన్నాయి. కీచురాళ్ళ రొద గీపెడ్తున్నాయి. రోడ్డు ప్రక్కనే తుమ్మచెట్లు గాలికి తెగ ఊగిపోతున్నాయి. చలి గాలి రివ్వున వీస్తోంది.**

రెండు ఫర్లాంగుల దూరంలో తను వెళ్ళవలసిన పల్లె వీధి కరెంటు లైట్లలో మిణుకు మిణుకుమంటూ కానొస్తోంది. ఆ పల్లెకు చేరాలంటే మట్టిరోడ్డు అంతా గతుకుల మయం.

రేపు జిల్లా యస్పీగారి విజిట్ ఉంది ఎనిమిది గంటలకు. ఏదో పెండింగ్ కేసు తాలూకూ సాక్షిని హాజరుపర్చాలి. సాక్షి రాఘవులుండేది ఆ పల్లెలోనే. సాక్షిని తీసుకురమ్మని తనకు హుకుం జారీ చేసి జీపులో యస్పీగారు సి.ఐ. దగ్గరకు పరుగెత్తారు పిలుపు రావడంతో.

యస్పీగారు రేపొస్తున్నారని ఈ ఉదయమే తెల్సింది కదా! నన్ను ట్రాఫిక్ డ్యూటీకి వెయ్యకపోతే ఏంటట! కాస్తంత ముందుగానే పంపొచ్చుగా! విసుక్కున్నాడు గంగాధరం.

రెండేళ్ళ క్రితం తన ఫస్ట్ అప్పాయింట్‌మెంటు ఈ స్టేషన్లోనే.

తను ట్రాఫిక్‌ను బాగా మైంటైన్ చేస్తానని యస్పీగారికి కూడా అభిమానం. మెచ్చుకోలుగా చాలాసార్లు అన్నాడు కూడా.

తను రోడ్డు మీదకు లాఠీ పట్టుకొని వస్తే చాలు!

కూరగాయల మార్కెట్లు, పండ్ల మార్కెట్‌లోని అడ్డదిడ్డంగా ఉండే బండ్లు క్షణాల్లో క్లియర్ అవుతాయి.

ఆటోలు, రిక్షాలు, నాలుగు చక్రాల వాహనాలు ఎటువటు ఆర్డర్‌లోకి రావాల్సిందే. వెళ్ళిపోవాల్సిందే. అంతెందుకు! రామా టాకీసు లైన్లో షాపుల ముందు బుట్టల్లో పండ్లు, కాయలు పెట్టుకొని అమ్ముకునే వారు దడదడలాడిపోవాల్సిందే.

సైకిళ్ళు, స్కూటర్లు, తోపుడుబండ్లు, పార్కింగ్ స్థలాల్లో కాకుండా, షాపుల ముందో, రోడ్డుమీదనో, హాస్పిటళ్ళ ముందో ఆ లైన్లో కానొచ్చాయో! అంతే సంగతులు!!

''ఏదో కాస్త చూసీ చూడనట్టు పోవోయ్ గంగాధరం'' అంటూ సీనియర్లు చెప్తున్నా ముక్కుకు సూటిగానే పోయేవాడు గంగాధరం.

''కొత్త సున్నం ఘాటులే!'' అంటూ చాటుమాటు విమర్శలు అటు చిన్నసైజు వ్యాపారుల నుండీ, ఇటు సీనియర్ల నుండీ ఉంటుండేవి.

ఆ మున్సిపల్ టౌన్లో చేతిలో లాఠీ పట్టుకొని తిరుగుతుంటే అదొక హుందాతనంగానూ ఉండేది గంగాధరానికి.

స్టేషన్లో డ్యూటీ రిజిస్టర్లో సంతకం పెట్టి 'పాయింట్'లోకి వెడితే-

ఆటోవాళ్ళు, టీ బంకులవాళ్ళు, వాహనాల డ్రైవర్లు, పండ్ల దుకాణాలదారు ఒకటేమిటి 'నమస్తే అన్నా!' అంటూంటే అదొక హుందాతో గుండె వెడల్పయ్యేది. ఛాతీ ఉప్పొంగిపోతుంది.

సమయం పది కావొస్తోంది.

బడి బిల్డింగుల దగ్గరే మట్టిరోడ్డుకు అటూ, ఇటూ 'తంతె' గోడల్లా ఉంటే కూర్చున్నారు. పగలంతా డ్యూటీ. స్టేషన్‌కు చేరగానే ఈ డ్యూటీ. గంగాధరానికి ఆకలి కరకరలాడుతోంది.

''టీ ఏమన్నా దొరుకుతుందా?'' అడిగాడు గంగాధరం.

''ఏడు గంటలకే అనంతమ్మ కొట్టు కట్టేస్తాది బాబు'' అన్నాడు రాఘవులు లేచి లుంగీని సరిగ్గా బిగేసి కట్టుకుంటూ.

అట్టే జనం లేరు రాత్రి కాబట్టి. ఎవరో ఒకరో అరా అటుపోతూ, ఇటు పోతూ కానొస్తున్నారు. అంతలో రాఘవులు తమ్ముడు వచ్చాడు.

''ఫ్యాన్ బెల్ట్ పోయిందంట! ఓ గంట పట్టుంద్దంట. ఓ గంటకు వస్తాడంట'' చెప్పాడు.

నడిచి రోడ్డు దాకా వెళ్ళినా ఆ రాత్రి రూట్‌లో పెద్దగా వెహికిల్స్ రావు.

''వెయిట్ చేద్దాం'' అన్నాడు గంగాధరం.

అంతెందుకు? అటు మొన్నటి ఎలక్షన్లు! మొన్నటి 'సి.ఎం.'గారి పర్యటనల్లో, పెద్ద దొరగారి ఆకస్మిక విజిట్లప్పుడు, తన డ్యూటీ ఉత్సాహానికి, యస్పీగారు ఎంత మెచ్చుకున్నారని!

కుర్రాడు! ఉత్సాహవంతుడని స్టేషన్లో చిన్నపాటి మెచ్చుకోలు! బిరుదు కూడా! అప్పుడప్పుడు తను యస్పీగా ప్రమోషన్ కొట్టేసినట్టు కలలు కూడా రావడం కద్దు.

డియస్పీ, యస్పీగారి దృష్టిలో తను పడాలి. 'గంగాధరం ఏడోయ్!' అన్పించుకోవాలి.

బొంతరాయి బూటుకాలికి గట్టిగా తగలడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. పల్లెలోకి అడుగుపెట్టాడు. ఆ సరికే పల్లె నిద్రపోతోంది. రాఘవులు అడ్రసు కనుక్కోవడం పెద్ద కష్టమేమీ కాలేదు. ఊరు బైట బడి బిల్డింగుల దగ్గరకు వచ్చారు గంగాధరం, రాఘవులు.

ఆ సమయంలో తిరిగి పట్టణం చేరాలంటే రోడ్డు దాకా నడిచి వచ్చి ఏదొక వెహికల్ పట్టుకొని రావాలి.

ఆ పల్లెలో ఒకే ఒక ఆటో ఉంది. రాఘవులు ఓ మనిషిని పంపాడు ఆటో తెమ్మనమని. రాఘవులు ఓ రైతు కూలి. సదరు ఆటో వాలాను నిద్ర లేపుకుని ఆటోను తీసుకు రమ్మనమని రాఘవులు తన తమ్ముడినే పురమాయించి పంపాడు.

బడి బిల్డింగ్‌ల చుట్టూ పెద్దగా ఇళ్ళు లేవు. అయితే మూడు నాలుగు గుడిసెలున్నాయ్. వీళ్ళకెదురుగా, మట్టిరోడ్డుకు అవతలి వైపున ఓ గుడిసె. కరెంటు స్థంభానికి లైటు వెల్గుతోంది. ఉసిళ్ళు, పురుగులు, ఆ లైట్ చుట్టూ ముసురుకొని ఉన్నాయి.

జేబులోంచి సిగిరెట్ తీసి వెల్గించి గట్టిగా దమ్ము లాగాడు గంగాధరం.

అంతలో-

ఎదురు గుడిసెలోంచి-పదేళ్ళ అమ్మాయి స్టీలు గ్లాసు తీసుకుని వచ్చింది.

ఆ అమ్మాయి ఒక చేయి ఎముక విరిగిందల్లె ఉంది. కట్టు వేసి ఉంది. మెడకు చేతికి ఓ హేంగర్ కూడా ఉంది.

''అయ్యగారూ..పాలు..'' అంది.

గంగాధరం ఆశ్చర్యంగా చూసాడు. పేదరికం కొట్టొచ్చినట్టు కానొస్తోంది ఆ పిల్లలో.

అంతలో ఓ నడికారు బక్క పలచని స్త్రీ చేతుల్లో నాలుగు పండ్లు. రెండు సీతాఫలాలు, రెండు దానిమ్మ కాయలు తెచ్చింది.

''తీస్కోండి బాబు, ఈ యాళప్పుడు మా ఊళ్ళో ఏం దొరకవ్'' అంది.

ఎక్కడో వాళ్ళను చూసిన జ్ఞాపకం. సరిగ్గా స్ట్రైక్ కావడం లేదు. గుర్తు రావడంలా. ఆ అమ్మాయి రెండో చేతిలోని పాలగ్లాసు తీసుకున్నాడు గంగాధరం.

''అమ్మాయి చేతికేమైంది?'' అన్నాడు.

అంతలోనే ''నువ్వు-రామాటాకీసు సెంటర్లో పండ్లు అమ్ముతుంటావ్ గదూ!'' అన్నాడు.

''అవును బాబు. ఇవి తినండి! అన్నం వేళైంది తీస్కోండి'' అన్నది ప్రాధేయపడుతున్న ట్లుగా. ''ఈమె గంగమ్మ బాబూ!'' పేరు చెప్పాడు రాఘవులు.

మెదడు చురుగ్గా పనిచేసింది. వీళ్ళు..వీళ్ళు..తల్లీబిడ్డలు..రోజూ ఆ సెంటర్లో ట్రాఫిక్ నియంత్రించే వేళ చూస్తూనే ఉంటాడు తను. ఆరోజు..ఆరోజున..సి.యం.గారి పర్య టన ముందురోజు నుంచే ట్రాఫిక్ నియం త్రణ ఉండింది.

పర్యటన రోజున జనం! జనం! మహా జనం! వాహనాల హోరు. మైకుల హోరు. రామా టాకీసు సెంటర్లో చిరు వ్యాపారాల న్నింటినీ తొలగించే వేళ-జరిగిన తోపు లాట!

తనకిప్పుడు బాగా గుర్తొచ్చింది. షాపుల వద్ద పేవ్‌మెంట్ మీద బుట్ట పెట్టుకుని అమ్ముతోంది. ఒకసారి ఈ ప్రాంతంలో కన్పించవద్దని తను కసిరాడు. ఆమె వెంట ఈ అమ్మాయి కూడా ఉంది.

అలా తొలగినట్లు తొలగి మరి కాసేపటి లోనే అదే ప్రాంతంలో అదే చోట కానొ చ్చింది పండ్ల బుట్టతో. ఓ వైపు జనవాహిని! జనవాహిని మధ్యలోంచి 'కాన్వాయ్' రయ్ మంటూ పోతోంది.

గంగాధరం విసురుగా పండ్ల బుట్టను అల్లంత దూరానికి తోసివేసాడు. పండ్లన్నీ రోడ్డు మీద జనం పాదాల క్రింద నలిగిపో యాయి.

''బుద్ధిలేదూ చెప్తుంటే'' లాఠీ ఝుళి పించాడు. జనం తోపులాట. అడ్డం వచ్చిన వారిని విసురుగా నెట్టాడు గంగాధరం.

ఆ తోపులాటలో ఈ అమ్మాయి పడిపో యింది. అలా పడిపోయిన అమ్మాయిని చూడగ ల్గాడే గానీ, చేయందించ లేకపోయాడు గంగా ధరం.

'ఆ ఫలితమేనా ఈ కట్టు! విరిగిన చేయి!'

'ఆ చిన్నారి చెయ్యేనా! ఇప్పుడు ఈ రాత్రివేళ ప్పుడు, నన్ను గుర్తించి, గౌరవిస్తూ- గోరువెచ్చని పాలు అందించేది!!'

'తను నిర్దాక్షిణ్యంగా నెట్టివేసిన ఆ చేతులేనా! తన ఆకలిని గమనించి నాలుగు పండ్లు అందిం చేది?'

ఇప్పుడు గంగాధరంలో కానిస్టేబుల్ లేడు. జాలి దయ నిండిన మనిషి ఉన్నాడు.

పాల గ్లాసు చేతిలోకి తీసుకున్నాడే గానీ తాగలే కపోయాడు.

ఆ అమ్మాయ్ తలమీద ఆప్యాయంగా చెయ్యి వేశాడు.

''ఈమధ్యనే సింహాద్రి చచ్చిపోయాడు సార్. పాపం గంగమ్మకు బతుకుతెరువు పోయింది. రోజూ టౌనుకు పోయి పండ్ల బేరం చేత్తాదీ బాబు. ఏదో ఇంత గంజి తల్లీ కూతుర్లకు రావడం కూడా కష్టమే. మొన్నేదో టౌన్లో జనం రద్దీలో కిందపడి చెయ్యిరగ్గొట్టుకుంది పిచ్చిది'' చెప్పుకుంటూ పోతున్నాడు రాఘవులు.

'సల్లారతయ్! పాలు తాగు సార్' అంది ఆ అమ్మాయి గంగాధరం కళ్ళల్లోకి చూస్తూ.



''గంగమ్మా! ఆ షాపులముందు పేవ్‌మెంట్ల మీద అమ్ముకోకపోతే మార్కెట్లో అమ్ముకోవ చ్చుగా'' అన్నాడు గంగాధరం.

''మేం ఎంతటోళ్ళం బాబూ! అద్దెలు మేం కట్టలేం! పెట్టుబళ్ళు మా దగ్గర ఏడ ఉంటయ్యి..ఏదో తట్టలో బుట్టలో యాపారమే మాకు. అమ్ముడుపోతే ఓ నలభై యాభై రూపా యలుంటయ్యి!''

గంగాధరంలో పూర్తిగా సాటిమనిషే ఉన్నాడు. డ్యూటీలో పోలీసు లేడు.

అంతలో ఆటో వచ్చింది.

రాఘవులుతోపాటు ఆటోలో ఎక్కి కూర్చుంటూ-

''గంగమ్మా..నువ్వు రేపు రామా టాకీసు సెంటర్లో కన్పించు! ఏదోక షాపు దగ్గర్లో లేదా ఫ్రూట్ మార్కెట్‌లో గానీ నీవు ఒక చోట కూర్చుని పండ్లమ్ముకునే ఏర్పాటు నేను చేస్తాను. ఇదుగో..ఈ ఐదొందలు ఉంచు. అమ్మాయికి కావాల్సిన మందులు, ఇంజెక్షన్లు వేయించు.. పోనీ'' అన్నాడు ఆటోవాలా వైపు తిరిగి.

రాఘవులు కన్నార్పకుండా గంగాధరం వైపే చూడసాగాడు.

చీకటిని చీల్చుకుంటూ మట్టి, గుంతల రోడ్డులో భారంగా కదులుతూ టౌనుకు బైల్దే రింది ఆటో. 'ట్రాఫిక్ కంట్రోలింగ్ సమ యాల్లో కాస్త చిన్నా చితకలను చూస్తుండా లోయ్' అన్న సీనియర్ల మాటలు గుర్తుకొస్తు న్నాయి గంగాధరానికి.